సాక్షి ప్రకాశం
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఖాకీ స్టార్స్

జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లు.. ఎస్సై ఉద్యోగాలకు ఎంపిక య్యారు. పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

- 8లో..



విద్యార్థుల భవితకు బంగారుబాట

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29/22

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. దట్టమైన పొగమంచు కురుస్తుంది. తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల పరిస్థితి, భద్రత చర్యలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించేందుకు జిల్లాకు వచ్చిన ఈవీఎంలకు ఇటీవల ఎఫ్ఎల్‌సీ నిర్వహించి భద్రపరిచినట్లు తెలిపారు. లోపాలున్న ఈవీఎంలను ఎలక్షన్ కమిషన్‌కు సరండర్ చేశామన్నారు. కొత్తగా వచ్చిన ఈవీఎంలతో ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సర్టిఫికెట్లు

- కలెక్టర్, జేసీ చేతుల మీదుగా పంపిణీ

ఒంగోలు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ అంశాలపై ఇచ్చిన శిక్షణ పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కీలక పనితీరు, జాబ్ చార్ట్, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, డిజిటల్, సోషల్ మీడియా, సర్వీస్ రూల్స్, కండక్ట్ రూల్స్, రికార్డు కీపింగ్, లీగల్ అంశాల్లో సచివాలయ ఉద్యోగులు శిక్షణ పూర్తి చేశారు. టెలీకమ్యూనికేషన్ కన్సల్‌టెంట్ ఇండియా లిమిటెడ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎంటర్‌ప్రైజెస్ వారు ఇచ్చిన శిక్షణలో 50 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, 20 మంది పంచాయతీ సెక్రటరీ గ్రేడ్–5 ఉద్యోగులు, చీమకుర్తి, కొండపి, కొత్తపట్నం, మద్దిపాడు మండలాల నుంచి మరో 70 మంది సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీపీఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఒంగోలు: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 23న మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో 5 చొప్పున ఎంపిక చేసిన ఉత్తమ ప్రాజెక్టులను 38 మండలాల నుంచి తప్పనిసరిగా ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాలన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో మొత్తం 190 ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుందని, 500 మంది వరకు విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరవుతారని వివరించారు. జిల్లా ప్రదర్శనలో ఉత్తమంగా ఉన్న 9 ప్రాజెక్టులను (3 గ్రూప్, 3 వ్యక్తిగత, 3 టీచర్ ప్రాజెక్టులు) ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఒక వ్యక్తిగత ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, ఒక గైడ్ టీచర్ మాత్రమే హాజరుకావాలన్నారు. గ్రూప్ ప్రాజెక్టుకు ఇద్దరు విద్యార్థులు, ఒక గైడ్ టీచర్‌ను అనుమతిస్తామన్నారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. థర్మాకోల్‌తో చేసిన నమూనాలను అనుమతించడం జరగదన్నారు. ఈ ప్రదర్శనకు సంబంధించి ఇంకేదైనా సమాచారం కావాలంటే జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ (9666955504)ను సంప్రదించాలని డీఈవో సూచించారు.

పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలి

మద్దిపాడు: రైతులంతా పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లిలో శనగ పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో సాగుచేసిన ప్రతి పంటను సర్వే నంబర్‌తో ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు దానివల్ల ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు. అంతేగాకుండా క్రాప్ ఇన్సూరెన్స్ పొందడానికి ప్రభుత్వం నుంచి మద్దతు ధరకు శనగలు కొనడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి రమేష్, ఏఈఓ శేషయ్య, వీఏఏ సాయికృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనా వెంకట్రావు, నాయకులు



కొండపిలో జగన్ జన్మదినం, సెమీ క్రిస్మస్ కేకులు కట్ చేస్తున్న మంత్రి సురేష్

జగమంతా పండుగ..

కులం చూడం..మతం చూడం..పార్టీలు అసలే చూడం..పేదరికమే అర్హతకు ప్రామాణికం అంటూ ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గ్రామగ్రామాన ఘనంగా జరిగాయి. జననేత జన్మదినం సందర్భంగా జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, ప్రభుత్వ వైద్యశాలల్లోని రోగులకు పండ్లు, స్వీట్లు, పాస్టర్లు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

- ఘనంగా సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు
- జిల్లా అంతటా పండుగ వాతావరణంలో నిర్వహణ
- రక్తదానాలు, అన్నదానాలు, వైద్య శిబిరాలు, రోగులకు పండ్లు, మిఠాయిల పంపిణీ
- ఒంగోలు బధిరుల పాఠశాలలో బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వేడుకలు
- కొండపి నియోజకవర్గంలో వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, పార్టీ సమన్వయకర్త ఆదిమూలపు సురేష్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న అవస్థలను ప్రజా సంకల్పయాత్రలో ప్రత్యక్షంగా చూసి 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ భరోసా ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం జిల్లా అంతటా అట్టహాసంగా జరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. కేకులు కట్ చేసి పెద్ద పండుగలా జరుపుకున్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, ప్రభుత్వ వైద్యశాలల్లోని రోగులకు పండ్లు, స్వీట్లు, పాస్టర్లు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, బైకు ర్యాలీలతో పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బధిరుల పాఠశాలలో యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జంకె వెంకటరెడ్డితో పాటు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఓడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పార్టీ నాయకులు కఠారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

■ కొండపిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పిన మంత్రి.. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో, మండలాల్లో పర్యటించిన మంత్రి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సింగరాయకొండలో అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి సింగరాయకొండలోని ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు, రొట్టెలు, మిఠాయిలు పంచిపెట్టారు.

■ మార్కాపురంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెంటర్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు.

■ కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ భవన్‌లో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. 13వ వార్డు సచివాలయంలో కూడా కేక్ కట్ చేసిన బుర్రా మధుసూదన్‌యాదవ్ మొక్కలు నాటారు.

■ దర్శిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. దర్శి పట్టణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 600 మంది పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు.

■ సంతనూతలపాడులో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సీఎం వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు.

■ గిద్దలూరులో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఎంపీపీ కడప లక్ష్మి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.



చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నాయకులు



చీమకుర్తి మండలం కేవీ పాలెం జగనన్న కాలనీలో స్వచ్ఛందంగా కేకులు ఏర్పాటు చేసి సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న స్థానిక మహిళలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపు
- 496 పాఠశాలల్లో 21,617 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అభ్యున్నతి సాధించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేసిన సందర్భంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర మేయర్ గంగాడ సుజాత, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రంగంలో సాంకేతికత పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో విద్యాబోధనలో కూడా టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రతి 60 మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ, 6 నుంచి 10వ తరగతి పాఠశాలల్లో ప్రతి సెక్షన్‌కు ఒక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ అందజేసినట్లు తెలిపారు. ఇప్పుడు అదనంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 496 పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 21,617 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన పరిజ్ఞానంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తూ పేద విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫాం, ఆహారం అందించడంతో పాటు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో ఆదుకుంటుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తూ ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ విద్యారంగంలో సమూల మార్పులు చేపట్టారన్నారు. సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీఈఓ వీఎస్ సుబ్బారావు, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ సుబ్బారావు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నకు కొండపిని కానుకగా ఇస్తా

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్



మంత్రి సురేష్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

కొండపి (సింగరాయకొండ): కొండపి సీటు గెలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టినరోజు కానుకగా ఇవ్వడమే తన లక్ష్యమని, అందుకు మీరంతా సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపి మండల కేంద్రంలోని సీతారామ కళ్యాణ మండపంలో గురువారం రాత్రి నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా సెమీ క్రిస్మస్ వేడుకలు, సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ నియోజకవర్గాలు 29 ఉండగా, అందులో 27 నియోజకవర్గాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుందన్నారు. మిగిలిన వాటిలో రాజోలు నియోజకవర్గం ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీలోకి వచ్చారని, ఇక కేవలం కొండపి మాత్రమే ఉందని అన్నారు. ఈసారి కొండపి సీటును వైఎస్సార్ సీపీ తప్పకుండా కైవసం చేసుకుంటుందన్నారు. తాను నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతానని, వచ్చే ఎన్నికల్లో కొండపి అభ్యర్థిగా పోటీ చేస్తానని, జగనన్న వదిలిన బాణం తానని సురేష్ ఉద్వేగంగా మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలు ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అండదండలతో కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. సెమీ క్రిస్మస్ కేకు, జగనన్న పుట్టినరోజు కేకును మంత్రి సురేష్ కట్ చేసి అందరికీ స్వయంగా తినిపించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బొక్కిసం ఉపేంద్ర, పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి మంత్రి సురేష్, ఆయన కుమారుడు విశాల్‌కు గజమాల వేసి సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మిడసల అశోక్, ఐ.కోటేశ్వరరావు, బి.రమేష్, ఎం.సాంబశివరావు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, కొండపి మండల అధ్యక్షుడు అరికట్ల కోటిలింగయ్య, బొక్కిసం సుబ్బారావు, జేసీఎస్ మండల కన్వీనర్ గొట్టిపాటి మురళి, అరికట్ల హరినారాయణ, దివి శ్రీనివాసరావు, రావెళ్ల రాజీవ్, వేముల వెంకట ప్రసాద్, కోటు, సుబ్బయ్య, ఆల శ్రీనివాసులరెడ్డి, పోటు శ్రీనివాసరావు, మండల కొండయ్య, పార్టీ సింగరాయకొండ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, టంగుటూరు మండల అధ్యక్షుడు ఎం.రాఘవరెడ్డి, జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, కొరకూటి వెంకటేశ్వర్లు, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, శేషారెడ్డి, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, సీఐలు పాండురంగారావు, దాచేపల్లి రంగనాథ్, ఎస్సైలు వై.నాగరాజు, టి.శ్రీరామ్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున
- సెమీ క్రిస్మస్ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తేనీటి విందు




సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: ప్రేమ, జాలి, దయ, శాంతి, సోదర భావంతో జీవించాలని ఏసుక్రీస్తు చేసిన బోధనలు అందరికీ ఆచరణీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రకాశం భవన్‌లో తేనీటి విందు నిర్వహించారు. మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జీసస్ చూపిన మార్గంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం పాటుపడుతోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రభుత్వం దళితులకు నివాస స్థలాలు, అవసరమైన చోట తక్షణమే శ్మశాన స్థలాలు మంజూరు చేసిందన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ మైనార్టీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని చెప్పారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో 3,242 మంది మైనార్టీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.1,94,38,850 జమచేసినట్లు తెలిపారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో 31 చర్చిలు మంజూరు చేసి నిర్మాణాలు కూడా పూర్తి చేసిందని తెలిపారు. కొత్తగా ఐదు చర్చిల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. రూ.50 లక్షల వ్యయంతో సంతమాగులూరు, రూ.12 లక్షల వ్యయంతో సీఎస్ పురం మండలం అరివేములలో కమ్యూనిటీ హాళ్లు నిర్మించామని తెలిపారు. జిల్లాలో 601 మంది పాస్టర్లకు గౌరవ వేతనం కింద నెలకి రూ.5 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. దైవ సేవకులు సందేశం అందించారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎ.సునీల్‌కన్న, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవికుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ ఆదారం షరీఫ్ (బుజ్జి), బిషప్ ప్రవీణ్‌కుమార్, ఒంగోలు చర్చెస్ డినామినేషన్ అధ్యక్షుడు ఎస్.ఐజాక్‌బాబు, పాస్టర్ విలయం కేరీ, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

మా నాయకుడు బాలినేని

- పాదయాత్ర పేటెంట్ వైఎస్సార్, జగన్‌ది మాత్రమే
- ఏ కమిట్‌మెంట్ లేని యాత్ర.. లోకేష్ పాదయాత్ర
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున



మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు అర్బన్: జిల్లాలో తమ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి అని, ఆయన ఆశీసులు ఎప్పుడూ తమకు ఉంటాయని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో గురువారం సెమీ క్రిస్మస్ తేనీటి విందుకు హాజరైన అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. పాదయాత్రకు పేటెంట్ రైట్స్ కేవలం వైఎస్సార్ ఫ్యామిలీకి మాత్రమే ఉంటాయన్నారు. దివంగత నేత వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రల ద్వారా రాష్ట్రం మొత్తం తిరిగి ప్రజల బాధలు తెలుసుకుని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలు పరిష్కరించి ప్రజలకు మేలు చేశారన్నారు. ఇది వారి కమిట్‌మెంట్ అని అన్నారు. కానీ, నారా లోకేష్‌ది పాదయాత్ర అని అంటున్నారుగానీ.. అది ఏ యాత్రో అర్థం కావడం లేదన్నారు. లోకేష్ పాదయాత్ర చేపట్టగానే వారి కుటుంబ సభ్యుడు ఒకరు మరణించారని, అనంతరం ఆయన తండ్రి చంద్రబాబు జైలు పాలయ్యాడని, లోకేష్ ఢిల్లీ పారిపోగా, చంద్రబాబు అరెస్టుతో మరణించిన వారికి చెక్కులు అందచేయాలని భువనేశ్వరి తిరిగారని, చంద్రబాబు జైలు నుంచి బయటకు రాగానే అటకెక్కించారని, అది వాళ్ల కమిట్‌మెంట్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 11.6 శాతం పేదరికాన్ని 6 శాతానికి తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. ఇటువంటి పాలన అందిస్తున్న తమకు ఎవరినో చూసి భయపడాల్సిన పనిలేదన్నారు. సీట్లు మారుస్తున్నారని అనడం హాస్యాస్పదమన్నారు. ప్రజల కోసం పనిచేసేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధంగా ఉంటారన్నారు. తమ నాయకుడు జగన్ జవాబుదారీ పాలన చేస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు ఎక్కడ పోటీ చేస్తున్నారో చెప్పాలన్నారు. అవి ఎవరి స్థానాలని ప్రశ్నించారు. చంద్రబాబే ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసే వ్యక్తి అని జగమెరిగిన సత్యమని మంత్రి వ్యాఖ్యానించారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు తయారయ్యారని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా

ప్రణీత్‌రెడ్డిని సత్కరించిన ఒడా చైర్మన్



ప్రణీత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డిని ఒడా చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు గురువారం సత్కరించారు. తనకు రెండోమారు ఒడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు రావడానికి కృషి చేశారంటూ ప్రణీత్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పలువురు మహిళా విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.

జగనన్న జైత్రయాత్ర చిత్ర నిర్మాణం ప్రారంభం



చిత్రీకరణలో పాల్గొన్న బృందం

ఒంగోలు సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇతి వృత్తంగా జగనన్న జైత్ర యాత్ర సినిమాను జె ఫిలిమ్స్ నిర్మాణ సంస్థ సారథ్యంలో ఏబీ రెడ్డి నిర్మాతగా జి.శివరాం దర్శకత్వంలో నిర్మించనున్నారు. ఒంగోలులో మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి నివాసం వద్ద గురువారం వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర నిర్మాణానికి క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర కథానాయకుడు దిగ్విజయ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఇతివృత్తంగా చిత్రం నిర్మిస్తున్నామన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం పక్షపాత వైఖరిపై నిరసన

ఒంగోలు: ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఉద్యోగ వ్యతిరేక, నిరంకుశ, పక్షపాత వైఖరి విడనాడాలని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కాకుమాని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ కార్యాలయం వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 26 నెలలుగా ఆర్‌ఎం కనీసం ఒక్క అప్పీలు కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. జిల్లాలోని డిపోల్లో డ్యూటీ చార్టులు అమలు చేయకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో నూతన బస్సులు తెప్పించాలని, ఖాళీలు, పదోన్నతులు వెంటనే భర్తీ చేయాలన్నారు. జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్ మాట్లాడుతూ.. గ్యారేజీ కార్మికులపై అధికారుల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. బస్సులకు అవసరమైన విడిభాగాలు తెప్పించాలని, బస్సులన్నీ పూర్తి కండిషన్‌లో ఉంచాలన్నారు. నిరసనలో డిపో కార్యదర్శి జి.మాధవరావు, జోనల్ సహాయ కార్యదర్శి బెజవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కేవీ పాలెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేవీ పాలెం సచివాలయంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యర్రగుంట్ల వసంత రావు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు.

ఎంఈఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

చీమకుర్తి: ఎంఈఎఫ్ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు బొంతా ఏసుదాస్ ఆధ్వర్యంలో నాయకులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు.

పంట నష్టాల నమోదు జాబితాను సరిచూసుకోండి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంట నష్టాల వివరాల జాబితాను సరిచూసుకోవాలని జేడీఏ ఎస్ శ్రీనివాసరావు కోరారు. ఆయా గ్రామాల్లో పంట నష్టాల నమోదు చేసిన తర్వాత ఆయా సచివాలయాల పరిధిలో ప్రదర్శించామని, ఈ నెల 22 వరకు సచివాలయాల్లో సరిచూసుకుని నమోదులో ఇతర లోపాలు ఉంటే తగిన వినతులు స్వీకరిస్తామని చెప్పారు. అర్హుకు అన్యాయం జరగకుండా, అనర్హలను జాబితాలో లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 25న కలెక్టర్ ఆమోదం తర్వాత తుది జాబితాను అందిస్తామని తెలిపారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

యర్రగొండపాలెం: వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే విద్యుత్ అదాలత్ లక్ష్యమని, సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో మాట్లాడారు. కోర్టులో, ఫోరంలో పెండింగ్‌లో ఉన్న కేసులు అదాలత్‌లో స్వీకరించలేమన్నారు.

నిండు నూరేళ్లు.. రారాజులా వర్ధిల్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం జిల్లాలో అట్టహాసంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించి వైఎస్ జగన్ క్షేమాన్ని కాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



దర్శిలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



న్యూఢిల్లీలో సహచర ఎంపీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి



మార్కాపురంలో జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ, పార్టీ నేతలు



కనిగిరిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్



మల్లవరం విజయ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, నాయకులు



వైపాలెంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఒంగోలు పీడీసీసీబీలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ప్రసాద్‌రెడ్డి



బేస్తవారిపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



బైరెడ్డి అరుణ ఆధ్వర్యంలో బొమ్మరిల్లు ఆశ్రమంలో సరుకులు అందజేస్తున్న మేయర్ సుజాత, ఒనుడా చైర్మన్ శింగరాజు మీనా

ఖాకీ స్టార్స్!



- ఎస్సైలుగా ఎంపికైన జిల్లాకు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు
- విధులు నిర్వర్తిస్తూనే సెలక్షన్‌కు సిద్ధం
- పోలీస్ అధికారుల ప్రశంసలు

ఒంగోలు సబర్బన్: జిల్లాకు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు ఎస్సైలుగా ఎంపికయ్యారు. సివిల్, స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తూనే ఎస్సై ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని కలల కొలువు సాధించారు. గత ఏడాది అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎంపిక ప్రక్రియ ఇటీవల పూర్తి కాగా గురువారం తుది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జోన్–3లోని గుంటూరు రేంజ్ పరిధిలో 55 ఎస్సై పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో జిల్లాకు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు నలుగురు, ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు ఎస్సైలుగా ఎంపికయ్యారు. వీరిని పోలీసు ఉన్నతాధికారులు, బంధుమిత్రులు అభినందించారు.



ఎస్.అలేఖ్య : నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఎస్.అలేఖ్య ప్రస్తుతం కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 2014లో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన అలేఖ్య 2013 బ్యాచ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. గతంలో ఒంగోలు తాలూకా, ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. అలేఖ్య భర్త రామరాజు కూడా కానిస్టేబుల్‌గా ఒంగోలు ఒన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. అలేఖ్య సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు.



జి.రాజశేఖర్ : గిద్దలూరు మండలం రాజుపేట గ్రామానికి చెందిన జి.రాజశేఖర్ జిల్లా స్పెషల్ పార్టీ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 2016 నోటిఫికేషన్ ద్వారా ఎంపికై 2018లో ఉద్యోగంలో చేరారు. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా జిల్లాలో వివిధ పోలీస్ సబ్ డివిజన్లలో పనిచేశారు. ప్రస్తుతం సివిల్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యారు.



పిచ్చాల వెంకటేశ్వరరెడ్డి : దర్శి పట్టణానికి చెందిన పిచ్చాల వెంకటేశ్వరరెడ్డి డిగ్రీ చదువుతూనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. 2014లో డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన వెంకటేశ్వరరెడ్డి.. 2013లోనే పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం వరించింది. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా ప్రస్తుతం మార్కాపురం డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్సై పరీక్షలో 6వ ర్యాంకు సాధించిన వెంకటేశ్వరరెడ్డి సివిల్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యారు.



ఎస్‌కే సిరాజ్ : దర్శి పట్టణానికి చెందిన ఎస్‌కే సిరాజ్ ప్రస్తుతం స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా ఒంగోలులో పనిచేస్తున్నారు. 2017లో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన సిరాజ్ 2018 పోలీస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికై 2020లో విధుల్లో చేరారు. గురువారం వెల్లడించిన ఎస్సై పరీక్ష ఫలితాల్లో 32వ ర్యాంకు పొందిన ఆయన ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యారు.

నస్రీన్ : పామూరుకు చెందిన నస్రీన్ 2018లో సివిల్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేక పోలీస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నస్రీన్ సివిల్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

గంటల వ్యవధిలో గుర్తించిన పోలీసులు ● క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత

ఒంగోలు సబర్బన్: ఇంటి బయట ఆడుకుంటూ.. అంతలోనే అదృశ్యమైన బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి, క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ సంఘటన గురువారం రాత్రి చీమకుర్తిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. చీమకుర్తి పట్టణం కొత్త కుమ్మరిపాలెంలో నివాసముంటున్న అశోకుమార్‌కు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చిన్నారి ఇంటి సమీపంలో ఆడుకుంటూ తప్పిపోయాడు. చిన్నారి కోసం తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో చీమకుర్తి ఎస్సై రామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీఐ శ్రీనివాసరెడ్డికి తెలియజేయడంతో ఆయన ఎస్పీ మలికా గర్గ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం పట్టణమంతా గాలించింది. రాత్రి 10.30 గంటల సమయంలో ఇటుకల బట్టీల వద్ద చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలో చిన్నారిని కనుగొన్న పోలీసులను ఎస్పీ అభినందించారు. పోలీసులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భవితకు బంగారు బాట

- సీఎం వైఎస్ జగన్ కృషితో విద్యాభివృద్ధి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- దర్శిలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. గురువారం దర్శి బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తాను బాధ్యతలు స్వీకరించాక దర్శిలో మొదటిసారి ఈ స్కూల్‌కే వచ్చానని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు రూ.10 లక్షలతో షెడ్, రూ.2 లక్షలతో సైకిల్ స్టాండ్ నిర్మించడంతోపాటు స్కూల్ గ్రౌండ్ బాగు చేయించానని చెప్పారు. దర్శి మండలంలో 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 1350 ట్యాబ్‌లు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఆర్థిక సమస్య కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మ వడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. గత ప్రభుత్వంలో కనీసం యూనిఫాం కూడా ఇవ్వలేదని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే జగనన్న విద్యా కానుక అందించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని, కురిచేడు జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఎంఈఓ రమాదేవి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామాంజనేయులు, హెచ్‌ఎం ఖాదర్‌మస్తాన్, కేవీజీ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

26న దర్శిలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, మేయర్ తదితరులు

- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన చేసిన కలెక్టర్, ఎమ్మెల్సీ

ఒంగోలు సెంట్రల్: మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న దర్శిలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా పలు దఫాలుగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారని, సరైన అవగాహనతో వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం యువతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ.. ఈనెల 26న దర్శి ప్రభుత్వ కాలేజీలో జాబ్ మేళాకు 15 కంపెనీలు హాజరవుతున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వేతనం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పొందే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 9988853335 లేదా 9100566581, 7013950097ను సంప్రదించాలని సూచించారు.

అసిస్టెంట్ కలెక్టర్ శౌర్య, నగర మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డీఈఓ వీఎస్ సుబ్బారావ, సీడాప్ జెడీఎం రజనీకాంత్, కార్పొరేటర్ శాండిల్య, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు కొనేందుకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..

- కల్వర్టును బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి
- మరో ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలంలో వంశీ మృతదేహం

మద్దిపాడు: క్రిస్మస్ పండగకు కొత్త దుస్తులు కొనాలని చెప్పి ఒంగోలు వెళ్లిన యువకుడు విగతజీవిగా ఇంటికి చేరాడు. స్నేహితులతో కలిసి బైక్‌పై వస్తుండగా మార్గ మధ్యంలో కల్వర్టును ఢీకొనడంతో కొలచనకోటకు చెందిన డొక్కా వంశీ(20) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మద్దిపాడు మండలం వెల్లంపల్లి సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొలచనకోట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన డొక్కా కృపారావు కుమారుడు వంశీ బీసీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. క్రిస్మస్‌కు కొత్త దుస్తులు కొనుక్కోవాలని తండ్రి వద్ద డబ్బు తీసుకుని ఒంగోలు వెళ్లాడు. సాయంత్రం వరకు స్నేహితులతో సరదాగా ఆడుకున్నాడు. రాత్రి పొద్దుపోయాక వంశీని ఇంటి వద్ద వదిలిపెట్టేందుకు వల్లంశెట్టి లక్ష్మీవెంకట్, డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న మరో స్నేహితుడు వెంకటేష్ బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్లంపల్లి సమీపంలో కల్వర్టును వీరి బైక్ ఢీకొట్టింది.

బైక్ నడుపుతున్న వంశీ ఘటనా స్థలంలోనే మృతి చెందగా వెనుక కూర్చున్న ఇద్దరికి రక్తగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు, మద్దిపాడు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.